సాక్షి డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కేవీపీ బాపన్న దంపతులు (హైదరాబాద్) శనివారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఏటా కార్తిక పౌర్ణిమ రోజు తమ తల్లిదండ్రులు సత్యానందం, శేషమాంబ పేరున అన్నదానం చేయాలని కోరారు.



శ్రీవారి ఆలయానికి రూ.2 లక్షలు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఆ గ్రామానికి చెందిన పిన్నమని రామకృష్ణ రూ.2 లక్షల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాస్‌కు అందజేశారు.

ఎలక్కొట్టుడు



ఎలక చిన్నదే.. సాగులో తెచ్చే నష్టం మాత్రం పెద్దది. అసలే ఖరీఫ్ సాగు ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆందోళనలో ఉన్న రైతులకు వీటి సమస్య ప్రాణసంకటంగా మారింది.

న్యూస్‌రీల్

శిల్పి వుడయార్‌కు డాక్టరేట్ ప్రదానం



చెన్నైలో డాక్టరేట్ అందుకుంటున్న శిల్పి రాజ్‌కుమార్ వుడయార్

కొత్తపేట: శిల్పకళా రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్‌కు చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) శనివారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కొత్తపేటకు చెందిన శిల్పి రాజ్‌కుమార్ వేలాదిగా వివిధ రకాల శిల్పాలు రూపొందించారు. ఆయన తయారు చేసిన అనేక శిల్పాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నెలకొల్పారు. తన తండ్రి శ్రీనాథరత్న శిల్పి వుడయార్ పేరుతో శిల్పకళా సాంస్కృతిక సేవా సంస్థ, వుడయార్ ఫైన్‌ఆర్ట్స్ స్థాపించి వాటి ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ విధంగా రాజ్‌కుమార్ ప్రతిభ, సేవలను గుర్తించిన జీహెచ్‌పీయూ చెన్నై భారతీయ విద్యా భవన్‌లో జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్)ను యూనివర్సిటీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పి.మాన్యుల్ ఆధ్వర్యంలో వైస్ చాన్సిలర్ డాక్టర్ కె.వెంకటేషన్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం చేశారు.

సందీప్ ట్రస్ట్ చైర్మన్‌కు..

సందీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెంకయ్య (చిట్టిబాబు)కు చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) సేవారత్న పురస్కారంతో పాటు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. వాడపాలెం గ్రామానికి చెందిన చిట్టిబాబు తనయుడు సందీప్ వైద్య విద్య అభ్యసిస్తూ మృతి చెందాడు. అప్పటి నుంచి సత్యవేణి, చిట్టిబాబు దంపతులు వారి తనయుడు, దివంగత వైద్య విద్యార్థి సందీప్ స్మృతిలో ఉచిత వైద్య శిబిరాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. స్వగ్రామం వాడపాలెంలో శాశ్వతంగా సందీప్ చారిటబుల్ ట్రస్ట్ సేవా భవనాన్ని నిర్మించారు. దాని ద్వారా తరచూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ విభాగాల ప్రముఖ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. చిట్టిబాబు సేవలను గుర్తించి పురస్కారం ప్రదానం చేశారు.

ఎరువుల సరఫరాలో కూటమి సర్కారు విఫలం



వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్

అమలాపురం టౌన్: రైతులకు నాణ్యమైన ఎరువులను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా కొరత అధికంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శనివారం అమలాపురంలో కిషోర్ 'సాక్షి'తో మాట్లాడారు. గత ఖరీఫ్ కంటే ఎక్కువగా ఎరువులను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కేవలం అంకెల గారడీతో కొన్ని వేల టన్నులు అందుబాటులో ఉన్నాయని ప్రచారం చేస్తోందన్నారు. ఇది ప్రచార ఆర్భాటమే తప్ప రైతులకు క్షేత్ర స్థాయిలో యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా అరికట్టే ప్రయత్నం చేయలేదన్నారు. యూరియాను దళారులు స్టాక్ చేయకుండా, అధిక ధరలకు అమ్మకుండా నియంత్రించాలన్నారు. యూరియా కొరత సృష్టిస్తున్న దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ అధికారులతో తనిఖీలు, దాడులు చేయించాలని కిషోర్ అన్నారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ – ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.3,12,790, అన్నప్రసాదం విరాళాలుగా రూ.52,960 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.



పడవపై రాకపోకలు సాగిస్తున్న గంటి పెదపూడిలంక వాసులు



అప్పనపల్లిలో కాజ్ వే నీట మునగడంతో ఉచ్చులవారిపేట మీదుగా వరద నీటిలోనే మోటార్ సైకిళ్లపై ప్రయాణం



గురజాపులంకలో వరద ముంపులో ప్రజల రాకపోకలు

నెమ్మదించిన నది

- శాంతిస్తున్న వరద గోదావరి
- ఇంకా జలదిగ్బంధంలోనే లంకలు
- ఇప్పటికీ పడవలపైనే ప్రయాణం
- ఆదివారం నుంచి వీడనున్న ముంపు

సాక్షి, అమలాపురం: లంక.. వంక చూస్తే 'కన్నీటి' వ్యథలే.. ఇళ్లు, దారుల్లో ఇంకా ముంపు తిప్పలే.. చుట్టూ వరద నీరు చేరడంతో అన్నీ కష్టాలే.. రెండు రోజులుగా జిల్లాలో లంక వాసులను హడలెత్తించిన వరద గోదావరి శాంతిస్తున్నా దిగువన లంక గ్రామాల్లో ముంపు కొనసాగుతోంది. రహదారులు, కాజ్‌వేలు ఇంకా నీటిలోనే ఉండడంతో స్థానికులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద శుక్రవారం మధ్యాహ్నం నుంచి తగ్గుతున్న గోదావరి వరద ఉధృతి శనివారం ఇంకా నెమ్మదించింది. శనివారం ఉదయం 6 గంటల సమయానికి బ్యారేజీ నుంచి 12,34,933 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇది సాయంత్రం 7 గంటల సమయానికి 9,83,312 క్యూసెక్కులకు తగ్గింది. తెల్లవారు జామున రెండు గంటల సమయానికి బ్యారేజీ వద్ద పాండ్ లెవెల్ 13.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక వెనక్కి తీసుకున్నారు. తర్వాత మొదటి ప్రమాద హెచ్చరికను కూడా తీసేశారు. అమావాస్య కారణంగా సముద్రంలోకి వేగంగా నీరు దిగడం లేదని లంక వాసులు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం సమయానికి లంకలను వరద పూర్తిగా వీడనుంది.



పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి వరద నీటిలో వస్తున్న రైతులు

ఇంకా పడవలపైనే..

పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక, ఊడుమూడిలంక, పశ్చిమగోదావరి జిల్లా కనకాయిలంక, మనేపల్లి శివారు శివాయలంకకు స్థానికులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయినవిల్లి మండలం ఎదురుబిడియం కాజ్‌వే ముంపు నుంచి బయట పడుతోంది. ఇంకా రాకపోకలు మొదలు కాలేదు. పడవలపైనే స్థానికులను దాటిస్తున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. బి.దొడ్డవరం, అప్పనపల్లి, పెదపట్నంలంక వాసులు మామిడికుదురు కొర్లగుంట, అప్పనపల్లి ఉచ్చుల వారిపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. కె.గంగవరం మండలం కోటిపల్లి మత్స్యకార కాలనీ ముంపులో ఉంది. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక, కూనాలంక, కాట్రేనికోన మండలం నడవపల్లి, పల్లంకుర్రు రేవు, అల్లవరం మండలం బోడసుకుర్రు పల్లెపాలెం, సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక, రామరాజులంక బాడవల వద్ద రోడ్లు, ఇళ్లు ముంపులోనే ఉన్నాయి.

పంట.. ముంపునీట

గోదావరి వరదకు కూరగాయ పంటలు, కొబ్బరితో పాటు అంతర పంటలు అరటి, పోక, కోకో తోటలు నీట మునిగాయి. ఉద్యాన పంటలకు పెద్దగా నష్టం లేకున్నా కూరగాయ పంటలు ఎక్కువగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. పి.గన్నవరం మండలంలో నష్టం ఎక్కువగా ఉంది. ఇక్కడ గోదావరి మధ్య లంకలతోపాటు ఏటిగట్లను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కూరగాయ పంటలు అధికంగా వేశారు. దీంతోపాటు సఖినేటిపల్లి, అయినవిల్లి, మలికిపురం, ముమ్మిడివరం మండలాల్లో కూడా కూరగాయ పంటలకు నష్టం అధికంగా ఉంది. సుమారు 300 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని అంచనా. బెండ, టమాటా, వంగతోపాటు తీగ పాదులకు అధికంగా నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. వీటితో పాటు పువ్వులు, బొప్పాయి పంటలకు ఇబ్బంది వచ్చినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చుట్టూ నీరు.. వదలని తీరు

ఎగువన వరద తగ్గుతున్నప్పటికీ కోనసీమలోని పలు లంక గ్రామాల్లో ముప్పు ఇంకా కొనసాగుతూనే ఉంది. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, సఖినేటిపల్లి, ముమ్మిడివరం మండలాల్లో పలు లంక గ్రామాలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, ముఖ్యంగా పూరి గుడిసెలు నీట నానుతున్నాయి. ఏటిగట్లపై నుంచి లంక గ్రామాలకు రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు ముంపులో కొనసాగుతున్నాయి. మూడు, నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించడంతో స్థానికులు పడవలు, ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, రైతులు పడవలపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

చవితి వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి



బి.కృష్ణారావు, ఎస్పీ

అమలాపురం టౌన్: జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకర్లకు ఆయన వివరాలు వెల్లడించారు. ఉత్సవ పందిర్ల ఏర్పాటుకు పోలీసుల అనుమతిని కోరుతూ సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్లు, మండపాల ఏర్పాటుకు 5 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా నియమించుకుని ఆ వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందించి అనుమతి పొందాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి పత్రం విధిగా ఉండాలని తెలిపారు. విద్యుత్ తీగలు, దీపాల వినియోగంలో షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వినాయక విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవాలు నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, మార్గం, ఉపయోగించే వాహన వివరాలు విధిగా పోలీసులకు తెలియజేయాలి. లౌడ్ స్పీకర్లను సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ, రాత్రి 10 గంటల నుంచి మర్నాడు ఉదయం 6 గంటల వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. పందిర్ల వద్ద, నిమజ్జన ఊరేగింపుల్లో అసభ్య ప్రదర్శనలు ఉండకూడదని ఎస్పీ సూచించారు.

29న జాతీయ శతాధిక కవి సమ్మేళనం



జాతీయ శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న అల్లవరంలోని శ్రీరవితేజ కళాశాలలో జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తెలిపారు. అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఆ కళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం, నానీల వేదిక సంయుక్త పర్యవేక్షణలో ఈ సమ్మేళనం జరుగుతుందని నానిరాజు వెల్లడించారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలోని సాయి సంజీవని ఆస్పత్రి ఆడిటోరియంలో జాతీయ శతధిక కవి సమ్మేళనం బ్రోచర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. కవులు, సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు పాల్గొని తెలుగు భాషా వెలుగులను నలుదిక్కులా విస్తరింపజేయడంలో భాగస్వాములు కావాలని నానిరాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి కడలి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి వైఆర్‌కే నాగేశ్వరరావు, పసలపూడి సతీష్ పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగించిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ సీఎంగా ఉండగా రాష్ట్రంలో 66 లక్షల మంది దివ్యాంగులకు పింఛన్లు అందిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 61 లక్షలకు కుదించిందన్నారు. దీంతో దివ్యాంగులు రోడ్డు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానం ఉంటే వారి ఇళ్లకు వెళ్లి విచారణ చేయాలే తప్ప, దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాని ప్రభుత్వం ఉన్న సంక్షేమ పథకాల్లో కోత విధించడం దారుణమన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ పింఛన్లు అందించిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పాలన పరంగా ఏమీ చేయలేక జగన్‌ను, వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇంత తక్కువ వ్యవధిలో ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న ప్రభుత్వం ఇదేనని గొల్లపల్లి అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, నాయకులు పాటి శివకుమార్, గుర్రం జాషువా, కుసుమ చంద్రశేఖర్, తాడి సహదేవ్, అడబాల జానకిరామ్, పిప్పర రాజు, చింతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పరిశుభ్రతకు పెద్దపీట



కామనగరువులో స్వర్ణ రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పల్లెల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం అమలాపురం మండలం కామనగరువు, పేరూరు, చింతాడగరువు, రోళ్లపాలెం గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే ఆనందరావు పరిశీలించారు. అమలాపురానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిపాదించిన స్థలాన్ని చూశారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న తరగతి గదుల్లో డిగ్రీ కళాశాల ప్రారంభించి దశల వారీగా భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అభిప్రాయానికి వచ్చారు. చిందాడగరువు- రోళ్లపాలెం స్వర్ణదుర్గ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఎరువుల విక్రయాలపై స్థానిక రైతుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ మహేష్ కుమార్, డీఆర్వో మాధవి తనిఖీలు నిర్వహించారు. ఈపాస్ మెషీన్ సక్రమంగా పనిచేయక పోవడంతో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. కామనగరువులో వస్తు మార్పిడి విధానంలో ప్లాస్టిక్‌కు బదులు నిత్యావసరాలు సరఫరా చేసేలా ప్రవేశపెట్టిన స్వర్ణ రథాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

విద్యార్థులకు యోగాభ్యాసన కార్యక్రమాలు

అమలాపురం రూరల్: జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎనిమిది సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం సమనస మహాత్మ జ్యోతీరావు పూలే బీసీ వెల్ఫేర్ బాలుర గురుకులాన్ని సందర్శించి తరగతి గదుల్లో విపశ్యన యోగాపై శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ప్రారంభానికి పది నిమిషాలు, ముగింపునకు పది నిమిషాల ముందు విపశ్యన ధ్యాన బోధన చేస్తున్నారన్నారు. ఇది సత్ఫలితాలను ఇస్తే తదుపరి అన్ని పాఠశాల్లో దశల వారీగా నిర్వహిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ, విపశ్యన యోగా నిపుణుడు అమర్, తహసీల్దార్ అశోక్ ప్రసాద్, పాఠశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



సమనసలో విద్యార్థులతో యోగా సాధన చేస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

నిరీక్షణకు తెర..



- ఎట్టకేలకు డీఎస్సీ-2025 మెరిట్ లిస్ట్ ప్రకటన
- కటాఫ్ మార్కులపై సర్వత్రా చర్చ
- ఈ నెల 25న సర్టిఫికెట్ల వెరిఫికేషన్?

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ-2025 ఫలితాలను శుక్రవారం రాత్రి ప్రకటించారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మహిళలే పైచేయి సాధించడం గమనార్హం. ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో పోస్టులు, జోన్ల వారీగా మెరిట్ జాబితాను పొందుపర్చారు. అందులో మొత్తం 60 కేటగిరీల పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టులను ఉంచారు.

ర్యాంకులు సాధించిన అభ్యర్థులు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. తమకు వచ్చిన ర్యాంకుకు ఉద్యోగం వస్తుందా? రాదా? అనే మీమాంసను వారు ఎదుర్కొంటున్నారు. పోస్టుల సంఖ్య ఆధారంగా ఓపెన్ కేటగిరీలో ఏ ర్యాంకు వరకూ ఉద్యోగం వస్తుంది.. అలాగే వివిధ రిజర్వేషన్ కేటగిరీల్లో మొదటి ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకూ పోస్టుల ఆధారంగా లెక్కలు వేసుకుంటున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు తమకు చాన్స్ వస్తుందా? రాదా? అనే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 1:1 నిష్పత్తిలో మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులను పిలిచే అవకాశముంది. ఈ నెల 25వ తేదీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

మహిళలదే పైచేయి

డీఎస్సీ 2025 నోటిఫికేషన్‌కు ముందు నుంచే ఉపాధ్యాయ శిక్షణ పొందిన అభ్యర్థులు డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యారు. డీఎస్సీకి ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందా? అని ఎదురుచూపులు చూసిన అభ్యర్థులు కాకినాడ, రాజమహేంద్రవరం, కృష్ణా జిల్లా అవనిగడ్డ వంటి ప్రాంతాల్లో డీఎస్సీ పరీక్షకు కోచింగ్ తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఉపాధ్యాయ కొలువు సాధించాలనే పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఈ పరీక్షల్లో వివిధ కేటగిరీ పోస్టులకు మహిళలే ఉత్తమ ర్యాంకులు సాధించడం గమనార్హం. ఉదాహరణకు మొదటి 150 ర్యాంకుల్లో 90 మంది మహిళలే కావడం విశేషం. అలాగే అన్ని కేటగిరీ పోస్టుల్లో కూడా మహిళలే అధికంగా ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎస్‌ఏ ఇంగ్లిష్‌లో మొదటి 23 ర్యాంకుల్లో 13 మంది మహిళలు ఉన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని విభాగాల్లో ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ/జెడ్పీ/ మున్సిపల్ మేనేజ్‌మెంట్లు
ఎస్జీటీ	423
ఎస్ఏ తెలుగు	65
ఎస్ఏ హిందీ	78
ఎస్ఏ ఇంగ్లిష్	95
ఎస్ఏ గణితం	64
ఎస్ఏ పీఎస్	71
ఎస్ఏ బయాలజీ	103
ఎస్ఏ సోషల్	132
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	210

మొత్తం 1,241 పోస్టులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ/ఎంపీపీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల పరిధిలో 1,241 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు 423 కాగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 818 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అధికంగా ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆ తర్వాత సోషల్, బయాలజీ పోస్టులు ఖాళీలు అధికంగా ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులు కేవలం రెండంకెల్లో ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో ఎస్ఏ (పీఎస్)-3, ఎస్ఏ (బీఎస్)-4, ఎస్ఏ (పీఈ)-1, ఎస్జీటీ పోస్టులు 104 ఖాళీలు ఉన్నాయి.

ఇవి కాకుండా జోన్-2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూల్స్, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్/ట్రైబల్ (గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ-49, టీజీటీ-272, పీడీ-3, పీఈటీ-24 పోస్టులు భర్తీ చేయనున్నారు.

కేటగిరి	అభ్యర్థి	మార్కులు	ర్యాంకు
ఎస్ఏ ఇంగ్లిష్	అమలకట్ల వరప్రసాద్	86.46	1
	గొలగాని రాంబాబు	84.38	2
	నిడదవోలు రాజరాజేశ్వరి	83.96	3
ఎస్ఏ హిందీ	లక్ష్మి చిక్కం	84.94	1
	దడాల దుర్గాప్రసాద్	82.73	2
	నేతల నేత్రిఅపర్ణ	81.05	3
ఎస్ఏ సంస్కృతం	ఆకాశం గౌరీష్‌బాబు	69.93	1
	బి.వెంకట సుబ్రహ్మణ్యం	65.57	2
	గొర్తి వెంకటశాస్త్రి	60.67	3
ఎస్ఏ తెలుగు	విత్తనాల వంశీకృష్ణ	90.35196	1
	వేదాంతం నరసింహాచారి	86.95051	2
	కట్టా సత్య హరీష్	86.88907	3
ఎస్ఏ బీఎస్	వత్రివీఎస్ సన్యాసినాయుడు	88.95280	1
	కె.వెంకటరెడ్డి	85.53268	2
	గెద్దం వెంకటశివప్రసాద్	84.19761	3
ఎస్ఏ మ్యాథ్స్	పక్కుర్తి రామకృష్ణ	87.1662	1
	బేతా ఆర్‌వీవీ సత్యవేణి	87.32963	2
	మామిడి రాంబాబు	85.83529	3
ఎస్ఏ పీఈ	కడిమిశెట్టి అశోక్	89.5	1
	కొల్లు శివకుమార్	89	2
	కలిగితి మణికృష్ణ	87.5	3
ఎస్ఏ పీఎస్	యనమల పంప ప్రసాద్	85.43	1
	తెడ్లపు లీలా శివజ్యోతి	84.14	2
	శివఅమ్మిరాజు చల్లా	83.74	3
ఎస్ఏ సోషల్	పెద్ది గంగానారాయణ	89.83884	1
	సంకాబత్తుల అన్నపూర్ణ	87.00550	2
	జామిశెట్టి సత్యాదేవి	85.94379	3
ఎస్జీటీ తెలుగు	వడగల సూర్యలక్ష్మి	94.56377	1
	కడలి రాజ్‌కిరణ్	93.91215	2
	గాయత్రి తోలేటి	93.50426	3

క్లుప్తంగా

అప్పనపల్లికి పోటెత్తిన భక్తులు



బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి పాత గుడితో పాటు కొత్త గుడి వద్ద సందడి నెలకొంది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ,భూ సమేత బాలబాలాజీ స్వామిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1,18,346 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. నిత్య అన్నదానానికి రూ.58,120 విరాళాలు అందించారన్నారు. స్వామివారిని 1,500 మంది భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. వెయ్యి మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

వరద నీటిలో వ్యక్తి మృతదేహం

రాజోలు: స్థానిక వశిష్ఠా నదీ తీరానికి వరద నీటిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (60) కొట్టుకువచ్చింది. ఇక్కడి కాటన్ పార్కు వద్ద చెట్ల పొదల్లో చిక్కుకుంది. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఉరివేసుకుని యువకుడి మృతి

పెరవలి: ఉసులుమర్రులో ఓ యువకుడు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పెరవలి ఎస్సై వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. నరసాపురం గ్రామానికి చెందిన బొర్రా తరుణ్ (20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుండగా, అమ్మమ్మ ఊరైన ఉసులుమర్రుకు ఈ నెల 21న వచ్చాడు. ఏమైందో ఏమో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరివేసుకున్నాడని, పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు. అతని మేనమామ బొరుసు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గ్రామీణ క్రీడా పోటీలు

కాకినాడ క్రైం: కాకినాడలోని ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా సంబరం ఆరంభమైంది. ఐడియల్ కళాశాల మైదానంలో ఈషా గ్రామోత్సవంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా కేవలం గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. 120 మందితో కూడిన 20 జట్లు పోటీల్లో నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. హోరాహోరీ పోరులో నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. పోటీలు ఆదివారంతో ఫైనల్స్‌కు చేరుకుంటాయి. ఆదివారం మహిళల త్రోబాల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎలకొట్టుడు



- పంటలపై మూషికాల దాడి
- పిలక దశలో ధ్వంసం
- నివారణకు అధికారుల చర్యలు శూన్యం
- ఆందోళనలో అన్నదాతలు

ఆలమూరు: ఎలక చిన్నదే.. సాగులో తెచ్చే నష్టం మాత్రం పెద్దది. అసలే ఖరీఫ్ సాగు ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆందోళనలో ఉన్న రైతులకు ఈ సమస్య ప్రాణసంకటంగా మారింది. ప్రస్తుతం పిలక దశలో ఉన్న వరి పంటపై మూషికాల దాడి అధికమైంది. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు, మరోపక్క ప్రతికూల పరిస్థితులు, ఇంకోపక్క ముషికాల బెడద కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రారంభ దశలోనే ఇలా ఉంటే పంట చేతి కొచ్చే సమయానికి మరింత నష్టాన్ని చేకూర్చుతాయని రైతన్నల్లో ఆందోళన నెలకొంది. సమస్య పరిష్కారానికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంకా బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేయకపోవడంతో రైతులను మనోవేదనకు గురిచేస్తుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 1.64 లక్షల ఎకరాల్లో సుమారు 1.40 లక్షల మంది రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. అందులో సుమారు 70 శాతం మేర వెదజల్లు సాగు చేపట్టగా, మిగిలిన పొలాల్లో సాధారణ పద్ధతిలో వరి నాట్లు వేశారు. ఈ సీజన్‌లో రైతులు అధిక విస్తీర్ణంలో స్వర్ణ (ఎంటీయూ 1318), తక్కువ విస్తీర్ణంలో ఎంటీయూ 7,029, విత్తనాల కోసం బొండాలు (ఎంటీయూ 3,626), పీఆర్ 126, ఎంటీయూ 1121 రకాన్ని సాగు చేస్తున్నారు.

ఇంకా స్పందించక..

ఖరీఫ్, రబీ సీజన్లలో ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ ఏటా బ్రోమోడయోలిన్ మందును నూకలు, నూనె మిశ్రమంతో కలిపి రైతులకు ఉచితంగా సరఫరా చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో పంట పొలాల్లో మూషికాల బెడద ఎక్కువై పంటను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. పంట పొలాల్లో ఎలుకలు తినేదాని కన్నా దాదాపు పది రెట్లు పంటను పాడుచేసే అవకాశం ఉంది. దీంతో పిలుక దశలోనే ఎలుకలను నిర్మూలిస్తే చిరు పొట్ట దశకు చేరుకునే సరికి వరి పంటకు సంబంధించి నష్ట నివారణకు దోహదపడుతుందని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ స్పందించి ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును త్వరితగతిన పంపిణీ చేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతుంది.

ఇదో అదనపు ఖర్చు

పంట పొలాలను నాశనం చేస్తున్న ఎలుకలను సంప్రదాయ పద్ధతిలో పట్టించేందుకు అధిక ఖర్చు అవుతుంది. చిలుకలు పండ్లను కొరికి పడేసినట్టు ఎలుకలు వరి దుబ్బులను కొరకడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వరి పంటను పూర్తిస్థాయిలో రక్షించాలనుకునేందుకు ఖర్చుకు వెనకాడని పరిస్థితి ఉంది. అందులో భాగంగానే బుట్టల సహాయంతో, పొగపెట్టే విధానంతో ఎలుకలను మట్టుబెట్టే చర్యలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరం భూమిలో సరాసరి సుమారు 50 ఎలుకలకు పైగా పట్టివేత జరుగుతుండగా, ఒక్కొక్క ఎలుకకు కార్మికులు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో ఎకరాకు ఎలుకల నివారణకే రూ.మూడు వేల వరకూ ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. ఎలుకల బెడద ఎక్కువగా ఉండడంతో వాటిని పట్టేవారికి అదే స్థాయిలో డిమాండ్ కూడా ఉంది.



ఎలుకల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు (ఫైల్)



బ్రోమోడయోలిన్ మందు మిశ్రమాన్ని కలుపుతున్న రైతులు (ఫైల్)

సామూహిక నివారణ సాధ్యమేనా!

వ్యవసాయ శాఖ ఏటా పంపిణీ చేసే బ్రోమోడయోలిన్ మందు సకాలంలో పంపిణీ చేసి రైతులను ఆదుకోవడం సాధ్యమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా పంట పొలాల్లో అధిక భాగం ఎలుకలను నిర్మూలించేందుకు అవకాశం ఉన్నందున ఆ మేరకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. అయితే బ్రోమోడయోలిన్ మందును ఇంకా పంపిణీ చేయలేదు. ఈ నేపథ్యంలో సామూహిక ఎలుకల నివారణ సాధ్యమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

మూషికాల బెడద నివారిస్తాం



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట పొలాల్లో ఎలుకల బెడద అధికంగా ఉందని గుర్తించాం. అందులో భాగంగా మూషికాల బెడదను నివారించి రైతులకు స్వాంతన చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలుకల ఉధృతిని నివారించేందుకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు సరఫరా చేయబోతున్నాం. అలాగే ఎలుకల నిర్మూలనకు పూర్వ సంప్రదాయ రీతికి అనుగుణంగా ఎలుకల కన్నాల్లో పొగను నింపి నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సీహెచ్‌కేవీ చౌదరి, వ్యవసాయ సహాయ సంచాలకుడు, ఆలమూరు

సమగ్ర మార్పులతో కొత్త బార్ విధానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రణ, వ్యాపార పరిపాలనలో సమగ్ర మార్పులు తీసుకు రావడమే లక్ష్యంగా కొత్త బార్ విధానం తీసుకు వచ్చిందని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో కొత్త బార్ పాలసీ, నవోదయం 2.0 పనితీరుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ దేవ్‌శర్మ మాట్లాడుతూ ఈ పాలసీ బార్ లైసెన్సుల మంజూరులో ఆన్‌లైన్ విధానం, ఎంపిక ప్రక్రియలో సమానత్వం పాటిస్తామన్నారు. ఏపీ వ్యాప్తంగా 840 బార్లు ఉండగా, దీనిలో ఇకపై వాటిలో పది శాతం కల్లు గీత కార్మికులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ ఫీజులు 70 నుంచి 50 శాతానికి తగ్గాయని వివరించారు. ఇందులో భాగంగా 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభాకు రూ.55 లక్షలు, 5 లక్షలపైన జనాభా ఉంటే రూ.75 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుందని అన్నారు. ప్రతి ఏడాది పది శాతం చొప్పున ఫీజులు పెంచుతామన్నారు. గతంలో బార్లు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండేవని, ఇక ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అనుమతి ఉంటుందని అన్నారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 28న కలెక్టర్ లాటరీ తీసి బార్లు కేటాయిస్తారని, సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రజా ఆరోగ్యం, సమాజ శ్రేయస్సు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా సారా వ్యాపారం చేసేవారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. మూడు కన్నా ఎక్కువ సారా కేసుల్లో ఉన్నవారిపై పీడీ యాక్ట్ విధించేలా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు తమ తమ కార్యాలయాల్లో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, సీనియర్ అధికారులతో రాత్రిపూట గస్తీ చేయాలని ఆదేశించారు. సారా వినియోగంతో అనర్థాలపై ప్రచారం చేయాలన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాల్లో విస్తృత దాడులు చేపట్టి సారా రహిత జిల్లాలుగా ప్రకటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళీ, అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఎక్సైజ్ జిల్లా అధికారులు చింతాడ లావణ్య, ఎస్‌కే వీడీ ప్రసాద్, ఏఈఎస్‌లు నాగరాహుల్, రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి



కూచిపూడి బుల్లారావు (ఫైల్)

దేవరపల్లి: గుండుగొలను – కొవ్వూరు ప్రధాన రహదారిలో దేవరపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రామన్నపాలెం పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కూచిపూడి బుల్లారావు(71) దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక పెట్రోల్ బంకులో పెట్రోలు కొట్టించుకోవడానికి బైక్‌పై వెళ్తున్న సర్పంచ్ కూచిపూడి బుల్లారావును ఎదురుగా వస్తున్న క్వారీ టిప్పర్ లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. బుల్లారావు తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. సర్పంచ్ బుల్లారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైకుంఠవాసా.. శ్రీవేంకటేశా..

- మార్మోగిన వాడపల్లి క్షేత్రం
- ఒక్కరోజే రూ.55.60 లక్షల ఆదాయం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు వాడపల్లి బాట పట్టారు. పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తర్వాత స్వామివారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాఢ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశారు. వైకుంఠవాసా.. శ్రీవేంకటేశా.. గోవిందా.. గోవిందా.. అంటూ ముందుకు సాగారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి స్వామివారికి వివిధ సేవలు నిర్వహించారు. వివిధ సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని కన్నుల పండువగా అలంకరించారు. దేవస్థానం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఇతర అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవల ద్వారా ఈ ఒక్కరోజు సాయంత్రం 4 గంటల వరకూ దేవస్థానానికి రూ.55,60,552 ఆదాయం వచ్చిందని ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్‌ఐ ఎస్.రాము ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఏపీఎస్ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి వాడపల్లి ఆలయానికి బస్సు సర్వీసులను నడిపింది.



వాడపల్లి క్షేత్రంలో భక్తజన సందోహం

ఒరిగిన పిల్లర్ సరిచేసేందుకు కాంట్రాక్ట్ ఖరారు

రూ.కోటితో ముంబయి సంస్థకు పనుల అప్పగింత

మలికిపురం: కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్‌లో భాగంగా దిండి– చించినాడ వద్ద వశిష్ఠ నది మధ్య నిర్మించిన రైల్వే వంతెనలో ఒక పిల్లర్ సుమారు రెండు నెలల కిందట ఒరిగిన సంగతి పాఠకులకు విదితమే. ఈ పిల్లర్‌ను సరి చేసేందుకు ముంబయి కంపెనీకి కాంట్రాక్టు ఖరారు అయ్యింది. ఈ వారంలోనే పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, వరదల వల్ల వాయిదా పడింది. వరద తగ్గిన తరువాత పనులు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. నదిలో ఓ వైపునకు 45 డిగ్రీల మేర ఒరిగిన ఈ వంతెన పిల్లర్‌ను తిరిగి యథాస్థానంలో ఉంచేందుకు ముంబయి కంపెనీ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇప్పటికే ఈ సంస్థ ప్రతినిధులు, ఇంజినీర్లు ఒరిగిన పిల్లర్ పరిస్థితిని అధ్యయనం చేశారు. దీనిని సరి చేయడానికి దాదాపు రూ. కోటి వరకూ ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనాతో కాంట్రాక్టు ఖరారైనట్లు ఆ వర్గాలు తెలిపారు. ఈ ఖర్చు అంతా కూడా ప్రస్తుత కాంట్రాక్టర్ భరించాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వంతెన నిర్మాణంలో ఆఖరు పిల్లరు ఇది భూ గర్భంలోకి వెళ్లే సమయంలో బురద బ్లో అవుట్ సంభవించి ఒరిగిపోయింది. స్థానిక కాంట్రాక్టు ఇంజినీర్లు అప్రమత్తమై రైల్వే ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో వారి సూచనల మేరకు డిజైన్ చేసి పిల్లర్ సరిచేసి యథాస్థానంలో ఉంచే విధంగా ప్రణాళిక రూపకల్పన చేశారు. ఈ మేరకు అనుభవం ఉన్న ముంబయి కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారు. సుమారు 23 మీటర్ల ఎత్తు గల ఈ పిల్లర్ నదిలో ఒరిగిపోయింది. నదిలో మరో 50 మీటర్ల లోతు వరకూ వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఈ 23 మీటర్ల పిల్లర్ నిర్మాణానికి ఇప్పటి వరకూ దాదాపు రూ. 5 కోట్లు ఖర్చు అయ్యింది.



దిండి - చించినాడ వద్ద వశిష్ఠ నదిలో ఒరిగిన రైల్వే వంతెన పిల్లర్

వాహన వినియోగం

- జిల్లాలో బైక్‌లు, కార్లదే హవా
- భారీగా పెరిగిన విక్రయాలు
- మొత్తం 4.91 లక్షల వాహనాలు

రాయవరం: జీవనశైలి మారింది.. ప్రతి పనిలోనూ వేగం పెరిగింది.. అందుకు అనుగుణంగా వాహనాల విని'యోగం' అధికమైంది. జిల్లాలో ఇంటికో ఏదొక వాహనం కనిపిస్తుంది. బండెక్కి బయటకు, షి'కారు'కు వెళ్లేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వ్యక్తిగత అవసరాలకూ వీటిని ఎక్కువగా కొంటున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పుడు కారు అంటే.. అబ్బో అనే వారు. కరోనా అనంతరం జీవనశైలిలో మార్పులు బాగా వచ్చాయి. మధ్యతరగతి కుటుంబాలు సైతం చిన్న బడ్జెట్‌లో కార్లు కొనుగోలు చేస్తున్నాయి. వివిధ కంపెనీలు కూడా బడ్జెట్‌లో కార్లను తీసుకు వస్తున్నాయి. వారాంతాల్లో సరదాగా గడిపేందుకు, వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వాటిని వాడుతున్నారు. ఇలా జిల్లాలో కార్ల సంఖ్య 47,105కు చేరింది. ఇదిలా ఉంటే కార్లను అద్దెకు ఇచ్చే సంస్కృతి పెరుగుతోంది. పట్టణాల్లో ఉన్న ఈ సంస్కృతి గ్రామాలకూ వచ్చింది. కారు నడపాలనే ఆసక్తి ఉన్నవారు అద్దె కార్లు తీసుకుని షి'కా రు'కు వెళ్తున్నారు.

బైకులదే 'సోకు'..

ఏటేటా జిల్లాలో ద్విచక్ర వాహనాల సంఖ్య పెరుగుతోంది. ఏడాదికి సగటున సుమారు 25 వేల వాహనాల రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ఈ-బైకుల వాడకం రెండేళ్లుగా బాగా పెరిగింది. చమురు ధరలు పెరిగిన తరుణంలో ఇవే ప్రత్యామ్నాయం అయ్యింది. యువత, వివిధ రంగాలకు చెందిన వారూ ఆధునిక వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు బైకులు, స్కూటర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఫైనాన్స్ సౌకర్యం కూడా వచ్చిన తర్వాత ఈ వాహనాల కొనుగోళ్లు పెరిగాయి. ఉద్యోగాలకు వెళ్లేవారు సమయం, ఖర్చు ఆదా చేసుకునేందుకు ఈ-బైకులను కొనుగోలు చేస్తున్నారు. సాగులో యాంత్రీకరణ పెరిగింది. కూలీల కొరత, వివిధ అవసరాల దృష్ట్యా అన్నదాతలు ట్రాక్టర్లను కొనుగోలు చేస్తున్నారు. వరి నాట్లు, కోతలు, మాసూళ్లకు కూడా ఈ యంత్రాలనే వినియోగిస్తున్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ, మట్టి, ఇసుక తరలింపు తదితర పనులకు ట్రాక్టర్లను వాడుతున్నారు.

ఆటోలదే హవా..

స్థానికంగా ఉపాధిని పొందేందుకు పలువురు ఆటోలు కొనుగోలు చేస్తున్నారు. గూడ్స్, ప్యాసింజర్ ఆటోలపై వేలాది మంది ఆధారపడ్డారు. పలువురు పార్ట్ టైమ్‌గా వినియోగిస్తున్నారు. జిల్లాలో పట్టణాలతో పాటు, పల్లెల్లోనూ ఆటోల వినియోగం అధికమైంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

రవాణా శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల సంఖ్య అధికంగా ఉంది. రవాణా శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల సంఖ్య 4.47 లక్షలుగా ఉండగా, ట్రాన్స్‌పోర్టు వాహనాల సంఖ్య 44,392 వరకూ ఉంది. జిల్లాలో నెలకు 2,500 నుంచి మూడు వేల వరకూ మోటార్ సైకిళ్లు కొనుగోలు చేస్తుండగా, నెలకు 200 వరకు కార్లను కొంటున్నారు. ఈ లెక్కన ఏడాదికి 30 వేలకు పైబడి నూతన వాహనాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

కాలుష్యం.. ఆపై ట్రాఫిక్

వాహనాల వినియోగం పెరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే వాయు కాలుష్యం అధికమవుతోంది. కొందరు కాలం చెల్లిన వాహనాలను ఇంకా నడుపుతున్నారు. వ్యక్తిగత వాహనాల రద్దీ పెరిగిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ట్రాఫిక్ నిబంధనలపై తరచూ కౌన్సెలింగ్ ఇస్తూ రద్దీని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని అధికారులు గుర్తించాలి.



మోటార్ సైకిళ్లు



కార్లు

కొనుగోళ్లు పెరిగాయి



జిల్లాలో మోటార్ సైకిళ్లు, కార్ల వినియోగం బాగా పెరిగింది. ప్రతి ఒక్కరూ వారి అవసరాల నిమిత్తం వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ఫైనాన్స్ సౌకర్యం ప్రతి చోట అందుబాటులోకి రావడంతో నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల వినియోగం పెరుగుతూ వస్తోంది. అదేవిధంగా ట్రాన్స్‌పోర్టు వాహనాల సంఖ్య అధికమవుతోంది.

– దేవిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి

